నార్త్ సిటీ మెట్రోను అటకెక్కిస్తారా?

ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్ట్‌ను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మేడ్చల్‌కు మెట్రోను విస్తరించ కుంటే.. పెద్ద ఎత్తున ఉద్యమం
- మెట్రో విస్మరణపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి మెట్రో సాధన సమితి హెచ్చరిక

మేడ్చల్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): నార్త్ సిటీ (ఉత్తర నగరం) ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్ట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుంది. నార్త్ సిటీ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నార్త్ సిటీకి మెట్రోను విస్తరించాలన్ని ప్రజల నుంచి పలుమార్లు డిమాండ్లు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరానికి నలువైపులా మెట్రో విస్తరణ, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణాలు చేసి నగరాన్ని అభివృద్ధి చేశారు. ఉత్తరం వైపున కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాలతో పాటు తూము కుంట, శామీర్‌పేట్ ప్రాంతాలకు మెట్రో విస్తరణపై సర్వే సంస్థలను ఎంపిక చేసి పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పగిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే మెట్రో విస్తరణ పనులను పక్కన పెట్టారు. నార్త్ సిటీ ఉత్తర తెలంగాణకు నగరానికి కనెక్టివిటిగా ఉన్న జాతీయ రహదారి 44 మేడ్చల్ ప్రాంతం మీదుగా ప్రతిరోజు నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు వేలాది సంఖ్యలో తిరుగుతుంటారు. మేడ్చల్‌కు మెట్రోను విస్తరిస్తే నార్త్ సిటీ మరింత అభివృద్ధి జరిగి ప్రజలకు సౌకర్యవంతంగా మారనుంది. మేడ్చల్ ప్రాంతంలో అనేక విద్యా సంస్థలు, పరిశ్రమలు, వివిధ రకాల కంపెనీలు ఉన్న దృష్ట్యా మెట్రో విస్తరణ జరిగితే వేలాది మంది ఉద్యోగులు, ఐటీ నిపుణులు, విద్యార్థులు కార్మికులు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. ఈ మెట్రో విస్తరణ ప్రాజెక్ట్ చేపడితే మొత్తంగా గ్రేటర్ హైదరాబాద్‌తో అనుసంధానించబడి ఉంటాయి.

విస్తరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం: మెట్రో సాధన సమితి

మేడ్చల్ ప్రాంతానికి మెట్రోను విస్తరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మెట్రో సాధన సమితి సభ్యులు హెచ్చరిస్తున్నారు. మెట్రో విస్తరణపై పలు దఫాలుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించినా, ఇప్పటి వరకు మెట్రో విస్తరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం, నార్త్ సిటీ అభివృద్ధిని కాంగ్రెస్ విస్మరిస్తున్న తీరు కనపడుతోందని మెట్రో సాధన సమితి సభ్యులు ఆరోపిస్తున్నారు. మెట్రో పనులు విస్మరించడంపై అవసరమైతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తాం. మేడ్చల్ ప్రాంతానికి న్యాయ బద్ధంగా రావాల్సిన మేడ్చల్ మెట్రోను సాధించి తీరుతామని హెచ్చరిస్తూ మెట్రో సాధనకు ఉద్యమించేందుకు త్వరలోనే ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తామంటున్నారు. అభివృద్ధి జరిగిన మేడ్చల్ ప్రాంతానికి మెట్రోను విస్తరించకుండా ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరంగా సృష్టించి, లేని నగరానికి మెట్రో విస్తరణ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యమించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

మెట్రో సాధించి తీరుతాం

మేడ్చల్ ప్రాంతానికి మెట్రోను సాధించి తీరుతాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి నలు వైపులా అభివృద్ధి చేసింది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మెట్రో ప్రాజెక్టును నార్త్ సిటీ అయిన మేడ్చల్, కొంపల్లి, తూంకుంట, శామీర్‌పేట్ ప్రాంతాలకు విస్తరించేలా సర్వే సంస్థలను ఎంపిక చేసి పనులకు అప్పగించింది. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులను విస్మరించింది. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలె.. కానీ, స్వార్థ రాజకీయాలు, ప్రయోజనాల కోసం కాదు. ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ భూములను పోగు చేసి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాపారం చేస్తున్నారు. తన లాభం కోసం మేడ్చల్ ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. మేడ్చల్ ప్రాంత అభివృద్ధితో పాటు వేలాది మందికి రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు మెట్రో సాధించేలా ఉద్యమం చేస్తాం.

– కేపీ వివేకానంద్ గౌడ్, ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం;

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించండి

- ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలి
- క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని కేటాయించాలి
- సీఎంకు ఎమ్మెల్యే కృష్ణారావు వినతి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 19: ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం, ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని, క్రీడా మైదానం కోసం స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి పత్రాన్ని అందించారు. నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ నుంచి గోకుల్ ప్లాట్స్ మీదుగా వసంత్ విహార్, హైటెక్ సిటీ వెళ్లేందుకు గోకుల్ జంక్షన్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మించాలని కోరారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో కేపీహెచ్‌బీ కాలనీ హైటెక్ సిటీ మార్గంలో, జేఎన్‌టీయూహెచ్ జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని, నిజాంపేట, ప్రగతినగర్, బాబుపల్లి ప్రాంతాలలో నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వాహనదారులకు మేలు జరుగుతుందన్నారు. కూకట్‌పల్లి అంబేద్కర్ వై జంక్షన్‌లో బాలానగర్ నుంచి కూకట్‌పల్లి మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జి, కూకట్‌పల్లి నుంచి ఎర్రగడ్డ మార్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, ఈ రెండు బ్రిడ్జిలను నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యకు విముక్తి లభిస్తుందన్నారు. మూసాపేట నుంచి కేపీహెచ్‌బీ కాలనీ మార్గంలో మూసాపేట ఆంజనేయనగర్ చౌరస్తా, కైత్లాపూర్ చౌరస్తాలలో రెండు చోట్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరారు. ఫతేనగర్ నుంచి సనత్‌నగర్ వైపునకు వెళ్లే మార్గంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వం హెచ్ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో రూ.40 కోట్ల నిధులను కేటాయించిందని, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. ఈ అండర్ పాస్ నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్నా, ఆస్తులను సేకరించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నష్ట పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ఆస్తుల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి, పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, కూకట్‌పల్లిలోని హుడా ట్రక్ పార్కు స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ట్రక్ పార్కును ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలించి, ఈ స్థలాన్ని క్రీడాకారుల కోసం మైదానంగా తీర్చిదిద్దాలని కోరారు.

బుక్ ఫెయిర్ ప్రారంభం

సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి : చరిత్ర చదివితే భవిష్యత్తు తరాలకు మంచి సందేశం ఇవ్వగలం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కళాభారతి, ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ప్రారంభించారు. సుమారు 350 స్టాళ్లు కొలువుదీరాయి. ఈనెల 29 వరకు బుక్ ఫెయిర్ ఉండనుంది. ఇందులో 200 మంది కిపైగా దేశ వ్యాప్తంగా ప్రచురణ కర్తలు, డిస్ట్రిబ్యూటర్లు, పుస్తకాలను ప్రదర్శించనున్నారని బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డా. యాకుబ్ షేక్ తెలిపారు. బుక్ ఫెయిర్ ప్రాంగణానికి మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు, సభా కార్యక్రమాల వేదికకు రచయిత్రి బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికకు తోపుడుబండి సాదిక్‌గా నామకరణం చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరామ్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ , తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, ప్రొఫెసర్ రమామేలుకోటే, ప్రముఖ పాత్రికేయులు రాంచంద్రమూర్తి, నగర గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, సొసైటీ సభ్యులు బాల్‌రెడ్డి, బి.శోభన్‌బాబు, ఆర్.శ్రీకాంత్, యు.శ్రీనివాస్‌రావు, సాంబశివరావు, స్వరాజ్ కుమార్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలి

సమావేశంలో జగన్మోహన్ శర్మ, మునిపల్లె శ్రీనివాస్

ఆర్కేపురం, డిసెంబర్ 19: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా ఐఏఎస్ లేదా రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్‌ను నియమించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ పేర్కొన్నారు. వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విదేశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏడాదిగా పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల కాగా, గందరగోళంగా ఉన్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ పోస్టుకు ఓ ఉన్నతాధికారిని నియమించి సంక్షేమ పరిషత్‌ని కాపాడాలని కోరారు. సభ్యులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఏండ్ల నుంచి బ్రాహ్మణుల సంక్షేమం కోసం పాటుపడుతున్న రాష్ట్ర స్థాయి సంఘాల నుంచి, కనీసం సంఘం నుంచి ఒక్కరిని సభ్యుడిగా నియమించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో భాస్కర మూర్తి, నమిలి కొండ కిరణ్ కుమార్, రఘునందన్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ మోస పూరిత వైఖరిపై నిరసన

- నేడు వేలాది మంది ఆటో డ్రైవర్లతో అసెంబ్లీ ముట్టడి
- సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదు

సమావేశంలో అభివాదం చేస్తున్న జేఏసీ నేతలు

హిమాయత్‌నగర్,డిసెంబర్19: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం వేలాది మంది ఆటో డ్రైవర్లతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు తెలిపారు. హిమాయత్‌నగర్ నుంచి ర్యాలీగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతామని, ఆటో డ్రైవర్లు ఇందులో అధిక సంఖ్యల్లో పాల్గొని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), ఏ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), ఎంఏ.సలీం, ఎండీ నజీర్(యుటిఏడబ్ల్యూ), వి.మారయ్య, ఎస్.రాంకిషన్ (బీఆర్‌టీయూ), వి.ప్రవీణ్(టీయూసీఐ) మాట్లాడారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు నెలలుగా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే, మంత్రి పొన్నం ప్రభాకర్ దాటవేస్తున్నారని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ఇది జీవన్మరణ పోరాటమని, లాఠీలు, తూటాలు తగిలినా వెనుకడుగు వేసే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. ర్యాపిడో, ఓలా, ఊబర్‌లతో పాటు ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంత మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారని తెలిపారు.సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నేతలు సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, మల్లికార్జున్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

నృత్య ప్రదర్శనిస్తున్న కళాకారిణి

కొండాపూర్, డిసెంబర్ 19: మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మేళాలో భాగంగా సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా, బుధవారం ఫిలడెల్ఫియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా నుంచి విచ్చేసిన కూచిపూడి నృత్యకారిణి స్నేహ ఇంద్రకంటి 'గజవదాన బేడువే, రుక్మిణి ప్రవేశ దరువు, రాధికా కృష్ణ అష్టపది, నీల మేఘ శరీర తరంగం' అంశాలను కూచిపూడి నృత్య రూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు. అనంతరం, కేరళకు చెందిన హేతి గ్రూప్ కళాకారులు శివగంగ, మనీషా, గోపిక, శ్రీలక్ష్మీ, మేఘులు అష్ట అయ్యప్ప అవతారం, శ్రీ శబరీ గిరి నాదం, ఆనంద భైరవి, మధువాడి తిల్లాన అంశాలను ప్రదర్శించారు.

ఎంటర్‌టైన్మెంట్‌లో రాణించాలంటే నైపుణ్యాలు ప్రధానం

టీ - హబ్ సీఈఓ సుజీత్ జాగిర్దార్

ఉత్తీర్ణత పత్రాలను అందజేస్తున్న సుజీత్ జాగిర్దార్, తదితరులు

కొండాపూర్, డిసెంబర్ 19: ఎంటర్‌టైన్మెంట్ పరిశ్రమలో విజయాన్ని సాధించాలంటే నైపుణ్యాలు ముఖ్యమని టీ – హబ్ సీఈఓ సుజీత్ జాగిర్దార్ అన్నారు. మీ స్కూల్ సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్‌లో భాగంగా టీ–హబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన 'డీఓపీ డైరీస్' పాడ్‌కాస్ట్ సిరీస్ పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎంటర్‌టైన్మెంట్ రంగంలో రాణించాలంటే నైపుణ్యాలు చాలా ప్రధానమన్నారు. ఆసక్తి కలిగిన వారికి మీ స్కూల్ సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఉత్తీర్ణతా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మీ స్కూల్ ఫౌండర్ ప్రతిభ పులిజాల, టీ–హబ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస తాలూక, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేసిన చారుసిన్హా ఐపీఎస్, డీఐజీపీ అనిల్ మింజ్, ప్రిన్సిపాల్ డి.అపర్ణ

విద్యతో పాటు సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలి

- సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ చారుసిన్హా

జవహర్‌నగర్, డిసెంబర్ 19: విద్యతో పాటు సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని అత్యుత్తమంగా ఎదగాలని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ చారుసిన్హా పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అరుంధతీనగర్ సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ డి.అపర్ణ ఆధ్వర్యంలో పాఠశాల 26వ వార్షికోత్సవం ఉత్కర్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐపీఎస్ అధికారి, ఐజీపీ చారుసిన్హా హాజరై మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న చందంగా విద్యార్థులు ఇష్టపడి చదివి దేశ పరిపాలన విభాగాల్లో ముఖ్య భూమిక పోషించాలన్నారు. సీఆర్‌పీఎఫ్ క్రమశిక్షణకు నిలయంగా నిలుస్తుందని, ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. టాలెంట్ ఎవరి సొత్తు కాదని, మనం తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించడం అభినందనీయమని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్, ఆర్ట్ ఎగ్జిబిషన్, సెన్సార్ పార్క్, ఇంటర్ హౌస్ వంటి పోటీలలో విద్యార్థులు సాధించిన విజయాలను తల్లిదండ్రులకు పిన్సిపాల్ డి.అపర్ణ తెలియజేశారు. విద్యార్థులు ప్రతి రంగంలో నైపుణ్యం సాధించడం సంతోషకరమని డీఐజీపీ అనిల్ మింజ్ అన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్స్ వైస్ ప్రిన్సిపాల్ హరిశంకర్, హెడ్ మిస్ట్రెస్ ఆశాజీ కుమార్, నవనీతారాణి, సబీనా, చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, ఓం ప్రకాశ్, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్లాస్టింగులతో దద్దరిల్లిన కోకాపేట

- వారం రోజులుగా పేలుళ్లు - ధ్వంసమైన వాహనాలు
- ప్రాణాలతో బయటపడిన అయ్యప్ప స్వాములు
- అక్రమ బ్లాస్టింగులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల ఆగ్రహం

ధ్వంసమైన ఆటో, ఇటాచీ వాహనం

ఎగిరిపడిన రాళ్లు, సువ్వలు

మణికొండ, డిసెంబర్ 19: కోకాపేట నియోపోలీస్‌లో గురువారం బ్లాస్టింగు బాంబుల మోతతో ఆ ప్రాంతం అంతా దద్దరిల్లింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకకాలంలో పది బ్లాస్టింగులు జరుగడంతో చుట్టు పక్కల ఉన్న జనం భయంతో పరుగులు తీయడం మొదలు పెట్టారు. వివరాలల్లోకి వెళితే, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట నియోపోలీస్‌లో ప్లాట్ నం.3లో నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం పదిచోట్ల బ్లాస్టింగులు చేశారు. ఈ పేలుడుతో దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు శబ్దం రావడమే కాకుండా చుట్టుపక్కల ఉన్న ఆటోలు, జేసీబీలు, పక్కనే శివాలయంలో ఉన్న అయ్యప్పస్వాములంతా పరుగులు పెట్టారు. ఈ ప్రమాదంలో ఓ ఇటాచీ, ఆటో, ఓ గుడిసె పూర్తిగా ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న అయ్యప్పల శిబిరంపై రాళ్ల పెంకులు ఎగిరిపడటంతో కొంత మందికి స్వల్ప గాయాలైనట్లు బాధితులు తెలిపారు. వారం రోజులుగా బ్లాస్టింగుల వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో చేస్తున్నారని తెలిసింది. గురువారం తెల్లవారు జామున పేల్చాల్సిన బ్లాస్టింగులు ఉదయం పదిగంటల సమయంలో పేల్చడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ బ్లాస్టింగులకు ఏ మేరకు అనుమతులున్నాయనే దానిపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. ఇలాంటి చోట్ల అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాత బ్లాస్టింగులకు అనుమతులివ్వాలని, లేకపోతే మా ప్రాణాలకే ప్రమాదంగా మారిందంటూ ఖానాపూర్, కోకాపేట వాసులు కోరుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా బ్లాస్టింగులు చేయడంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణలో రూ.200 కోట్ల స్థలం!

- జల మండలి నిర్లక్ష్యంతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి..
- వారం రోజులుగా పాగా వేసిన ప్రైవేటు వ్యక్తులు
- నిర్లక్ష్యం వీడాలంటున్న స్థానికులు

బంజారాహిల్స్ రోడ్ నం.10లో జల మండలికి కేటాయించిన స్థలంలో వెలిసిన ప్రహరీ, స్థలంలో తిష్ట వేసిన ప్రైవేటు వ్యక్తులు

బంజారాహిల్స్, డిసెంబర్ 19: నగరం నడిబొడ్డున జల మండలికి కేటాయించిన సుమారు రూ.200 కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు గురయింది. షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.10లోని తట్టిఖానా జల మండలి రిజర్వాయర్ పక్కన సర్వే నం.403లోకి వచ్చే టీఎస్ 1/ పీ, 4/పీ, బ్లాక్–హెచ్, వార్డు నం.10లో ఎకరం స్థలాన్ని 1999లో కేటాయించడంతో పాటు జల మండలికి అప్పగించారు. కాగా, అనంతరం రిజర్వాయర్ నిర్మాణం కోసం మరోసారి స్థలం కావాలని కోరడంతో 1.20 గుంటల స్థలాన్ని కూడా జల మండలికి కేటాయించారు. కాగా, ఈ స్థలం పక్కన గతంలో జూబ్లీహిల్స్ మున్సిపాలిటీ ఉన్నప్పుడు తమ ప్లాట్లున్నాయంటూ కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కోర్టులను ఆశ్రయించారు. అయితే, అవన్నీ గుర్తింపు లేని ప్లాట్లు కావడంతో వాటిని రద్దు చేశారు. కాగా, పి.పార్థసారథి అనే వ్యక్తి తాను సర్వే నం. 129/105(403/59పీ) లో ఐదెకరాల స్థలం కొన్నానంటూ జల మండలికి కేటాయించిన స్థలాన్ని క్లెయిమ్ చేశాడు. అయితే, ఆ సర్వే నెంబర్లు ఇక్కడివి కావని, అతడు చూపిస్తున్నవి బోగస్ పత్రాలంటూ రెండేళ్ల క్రితం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పార్థసారథి తదితరులపై కేసు నమోదయ్యింది. ఇదిలా ఉండగా, స్థలాన్ని సర్వే చేసి తమకు అప్పగించాలంటూ జల మండలి అధికారులు కోరడంతో షేక్‌పేట రెవెన్యూ అధికారులు రెండు వారాల క్రితం సర్వే చేసి సరిహద్దులు చూపించారు. ఈ స్థలం చుట్టూ వెంటనే ప్రహరీ నిర్మించాలంటూ సూచించారు. ఈ మేరకు జల మండలి స్థలాల పరిరక్షణ బాధ్యతలు చూసే ఎస్టేట్ ఆఫీసర్‌కు నివేదిక పంపించారు. అయితే, స్థలాన్ని కాపాడుకోవడంలో జల మండలి అధికారుల నిర్లక్ష్యంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రాత్రికి రాత్రే స్థలం చుట్టూ భారీ ప్రహరీ కట్టేశారు. స్థానికంగా దుండగులను పెట్టి ఎవరు రాకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారు. జల మండలి ఎస్టేట్ అధికారుల నిర్లక్ష్యంతో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రెడ్ హిల్స్‌లో పైపులైను పగలడం వల్లే..

ఖైరతాబాద్, డిసెంబర్ 19: జల మండలి రెడ్‌హిల్స్ పరిధిలోని ట్రంక్ మెయిన్ ఇన్‌లెట్ లైను పగలడం వల్లే తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఆ శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పైపులైను దెబ్బతిన్న విషయం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా పేర్కొన్నామని, సంబంధిత ప్రజా ప్రతినిధులకు వాట్సాప్ ద్వారా విషయం తెలియజేశామన్నారు. ఖైరతాబాద్ డబుల్ బెడ్రూం గృహ సముదాయాలకు నీరు సరఫరాలో కొంత ఆలస్యంగా జరిగిందని, దీంతో వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం, యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు.

స్థలాన్ని సర్వే చేసి జల మండలికి అప్పగించాం

బంజారాహిల్స్ రోడ్ నం.10లోని తట్టిఖానా జల మండలి వద్ద 2.20 ఎకరాల స్థలాన్ని గతంలోనే జల మండలికి అప్పగించాం. ఇటీవల కొంతమంది ప్రైవేటు వ్యక్తులు స్థలంలోకి వస్తే వారిపై కేసు పెట్టాం. వారు చూపిన పత్రాలు బోగస్‌వి. సరిహద్దు విషయాన్ని నిర్ధారించాలన్న జల మండలి అధికారుల కోరిక మేరకు రెండు వారాల క్రితం సర్వే నిర్వహించి హద్దులు చూపించాం. వెంటనే ప్రహరీ గోడ కట్టుకుని స్థలాన్ని కాపాడుకోవాలని సూచించాం. స్థలం కాపాడుకునే బాధ్యత జల మండలి అధికారులదే.

– అనితా రెడ్డి, తహసీల్దార్, షేక